సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 2 । జూలై । 2023

న్యూస్‌రీల్

ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్

సాక్షి,పాడేరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలైందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాడేరులోని అభ్యాసకుల సహాయ కేంద్రం 128 ద్వారా 2023–24 విద్యా సంవత్సరానికి బీఏ, బీకామ్, బీఎస్సీ గ్రూపుల్లో అడ్మిషన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. డిగ్రీ అడ్మిషన్లకు ఎస్‌ఎస్సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఓపెన్ ఇంటర్ పాసైన అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా అర్హత ధ్రువపత్రాలతో పాటు ఆధార్, కులధ్రువీకరణ పత్రాల జెరాక్స్ సెట్లు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు అడ్మిషన్ల సమయంలో అవసరమవుతాయన్నారు. ముందుగా అభ్యర్థులు ఓపెన్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఆ దరఖాస్తును డౌన్‌లోడ్ చేసిన తరువాత పాడేరు డిగ్రీ కళాశాలలోని అభ్యాసకుల కేంద్రంలో పరిశీలన జరుపుకోవాలని సూచించారు. దరఖాస్తు నమూనా సక్రమంగా ఉన్న పక్షంలో వెంటనే నెట్ సెంటర్లలో పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు.

ఈనెల 31లోగా ఫీజులు చెల్లించాలి

డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజులు, ల్యాబ్ ఫీజులు ఈనెల 31వతేదీ లోగా చెల్లించాలని ప్రిన్సిపాల్ సూచించారు. పూర్తి వివరాలకు అభ్యాసకుల కేంద్రం పాడేరు కోఆర్డినేటర్ మురళీధరరావును కళాశాల పనివేళల్లో 7382729728, 9494372020 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

108లో సుఖ ప్రసవం


పుట్టిన బిడ్డతో 108 సిబ్బంది

చింతూరు: మండలంలోని వంకగూడెంకు చెందిన ఉయికా కాంతమ్మ అనే గర్భిణి శనివారం 108లో ప్రసవించింది. ఆమెను 108లో కూనవరం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో నొప్పులు అధికమయ్యాయి. దీంతో ఈఎంటీ రామ్మోహనరావు పైలట్ అనిల్‌కుమార్ సహకారంతో ఆమెకు ప్రసవం చేశారు. ఆడశిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, చికిత్స నిమిత్తం వారిని ఏడుగురాళ్లపల్లి ఆస్పత్రిలో చేర్పినట్లు 108 సిబ్బంది తెలిపారు.

మెనూ ప్రకారం ఆహారం


స్టోర్ రూమ్‌లో కూరగాయలను పరిశీలిస్తున్న పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ఆదేశించారు. మండలంలోని బూసిగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. వంటశాల, స్టాక్ రూమ్‌ను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎప్పటికప్పుడు తాజాగా వేడివేడి ఆహార పదార్థాలు అందించాలని సూచించారు. కూరగాయలు వారానికి రెండు సార్లు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోడి మాంసం వారానికి రెండు సార్లు సక్రమంగా సరఫరా చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. విద్యార్థినులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల బోధన ఎలా ఉందని విద్యార్థులను ప్రశ్నించారు. విద్యార్థినులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని సూచించారు.పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పీవో సూచించారు.

జగనన్న సురక్ష విజయవంతం

- తొలిరోజు 5,028 మందికి ధ్రువపత్రాల పంపిణీ
- 12 మండలాల్లోని 19 సచివాలయాల్లో సేవలు
- సద్వినియోగం చేసుకున్న లబ్ధిదారులు


బలపంలో జగనన్న సురక్షలో ధ్రువపత్రం అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి


ముంచంగిపుట్టులో ధ్రువపత్రం అందజేస్తున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

సాక్షి, పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుజేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం తొలిరోజు విజయవంతమైంది. జిల్లాలోని 12మండలాల పరిధిలోని 19 గ్రామ సచివాలయాల్లో నిర్వహించారు. వీటి పరిధిలో 12,608 టోకెన్లు జారీ చేయగా 8,917 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. శనివారం రాత్రి 8 గంటల వరకు 5,028 ధ్రువపత్రాలు పంపిణీ చేశామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. జగనన్న సురక్ష నిర్వహించిన మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీవోలు రెండు బృందాలుగా ఏర్పడి ఉదయాన్నే తమ నిర్దేశిత గ్రామాలకు తరలివెళ్లారు.

ప్రత్యేక కౌంటర్లలో సేవలు

గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన శిబిరాల వద్ద ప్రత్యేక కౌంటర్లను అందుబాటులో ఉంచారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి చింతపల్లి మండలంలోని మారుమూల మావోయిస్టు ప్రభావిత బలపం సచివాలయంలో జగనన్న సురక్షను ప్రారంభించారు. భారీగా గిరిజనులు తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఇక్కడ 243 ధ్రువపత్రాలను కలెక్టర్,ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అలాగే హుకుంపేట మండలంలోని బాకూరు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ప్రారంభించారు. ఇక్కడ కూడా 445 ధ్రువపత్రాలను గిరిజనులకు పంపిణీ చేశారు. తొలిరోజు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంపై అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ అభినందించారు.


బాకూరులో ధ్రువపత్రం పంపిణీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

ఇంటి వద్దకే పథకాలు



సంక్షేమ పథకాలు ఇంటి వద్దనే అందుకుంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం వల్ల ఎంతో మేలు చేకూరింది. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం జగన్ పేదలకు న్యాయం చేస్తున్నారు. ధ్రువపత్రాలను తమకు అందజేశారు. ఆయనకు రుణపడి ఉంటాం.

– మర్రి సల్మే, గొందివలస, చిన్నలబుడు పంచాయతీ, అరకులోయ మండలం

అవస్థలు తప్పాయి



జగనన్న సురక్ష ద్వారా చాలా వేగంగా ధ్రువపత్రాలు అందించారు. ఇంటికి వచ్చి వలంటీర్, సచివాలయ సిబ్బంది జగనన్న సురక్షపై వివరించారు. నేను వెంటనే ఆదాయ ధ్రువపత్రం కోసం దరఖాస్తు పెట్టుకున్నా. గతంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి పొందే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ సమస్య తప్పింది. ప్రభుత్వ సేవలు చాలా బాగున్నాయి.

– రొబ్బ హరికృష్ణ, కించాయిపుట్టు, ముంచంగిపుట్టు మండలం

హరి సంకీర్తన.. గిరి ప్రదక్షిణ

ఏర్పాట్లు పూర్తి



సింహాచలం: సింహ'గిరి'ప్రదక్షిణకు సమయం ఆసన్నమైంది. వరాహ, నారసింహ అవతారాల కలయికతో శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి కొలువైన 32 కిలోమీటర్ల గిరి చుట్టూ ప్రదక్షిణ చేసేందుకు వేళాయింది. ఆషాఢ చతుర్దశిని పురస్కరించుకుని ఆదివారం జరిగే గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఏడాది సుమారు ఆరు లక్షల మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తారని అంచనా వేసి.. కలెక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా భక్తులు ప్రదక్షిణ చేసే 32 కిలోమీటర్ల మార్గంలోఎలాంటి ఇబ్బందులు పడకూడదన్న ప్రణాళికతో పలు చర్యలు చేపట్టారు.

ఏర్పాట్లు ఇలా..

- భక్తులు గిరి ప్రదక్షిణ చేసే 32 కిలోమీటర్ల మార్గంలో 29 ప్రదేశాల్లో దేవస్థానం స్టాళ్లు ఏర్పాటు చేసింది. ఆ స్టాళ్లలో భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు కుర్చీలు ఉంటాయి. ఇక్కడ జీవీఎంసీ మంచి నీటి సదుపాయం కల్పిస్తుంది.
- గిరి ప్రదక్షిణను ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు దేవస్థానం అధికారికంగా ప్రారంభిస్తుంది. కొండ దిగువ తొలిపావంచా నుంచి దేవస్థానం ప్రచార రథం బయలుదేరుతుంది. రథంతో పాటు భక్తులు ప్రదక్షిణ ప్రారంభించవచ్చు.
- గిరి, ఆలయ ప్రదక్షిణ భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా దేవస్థానం ఏర్పాట్లు చేసింది. ఆలయ ఉత్తర రాజగోపురం వద్ద, దక్షిణ గోపురం వద్ద బ్రిడ్జిలను ఏర్పాటు చేసింది. కింద నుంచి స్వామి దర్శనానికి, వంతెనపై నుంచి ఆలయ ప్రదక్షిణ చేసేలా ఏర్పాట్లు చేశారు.
- భక్తులకు సోమవారం అన్నదాన భవనంలో కదంబం, దద్ధోజనం అన్న ప్రసాదంగా అందిస్తారు.
- సోమవారం లక్ష లడ్డూలను సింహగిరిపై విక్రయించేందుకు సిద్ధం చేశారు.
- భక్తుల రద్దీ కారణంగా సోమవారం ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద నుంచే లఘు దర్శనం ఏర్పాటు చేశారు. ఎవరికీ అంతరాలయ ప్రవేశం లేదని అధికారులు ప్రకటించారు.
- నగర సీపీ త్రివిక్రమ్‌వర్మ ఆధ్వర్యంలో 2,100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైం తదితర విభాగాల పోలీసులు శనివారం సాయంత్రానికే సింహాచలం చేరుకున్నారు. ఉన్నతాధికారులు వారికి పలు సూచనలు చేశారు. ఏయే ప్రాంతాల్లో విధులు నిర్వర్తించాలో డ్యూటీలు వేశారు.

31 వైద్య బృందాలు.. 16 అంబులెన్స్‌లు

గిరి ప్రదక్షిణ నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మొత్తం 31 వైద్య బృందాలు, 16 అంబులెన్సులను సిద్ధం చేసినట్టు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకు ఈ వైద్య బృందాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని వివరించారు. 15 వైద్య బృందాల్లో వైద్యులు, నర్సు, ఇతర పారా మెడికల్ సిబ్బంది, 16 వైద్య బృందాల్లో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, అంబులెన్సులు సిద్ధం చేసినట్లు చెప్పారు. షిఫ్ట్ పద్ధతుల్లో వీరంతా పని చేస్తారు. ప్రోగ్రామ్ అధికారులు పర్యవేక్షిస్తారు.

విధుల్లో 60 మంది దేవదాయ సిబ్బంది

సింహగిరి ప్రదక్షిణ కోసం మొత్తం 60 మంది దేవదాయ శాఖ సిబ్బంది, అధికారులను నియమిస్తూ ఉప కమిషనర్ ఎస్.సుజాత ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల పాటు ఐదు షిఫ్ట్‌ల పద్ధతిలో సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. భక్తులకు మంచినీటి సరఫరా, ఇతర సదుపాయాలు కల్పిస్తారు. ఇంజినీరింగ్ అధికారులు వీరిని పర్యవేక్షిస్తారు.

రైతులకు రూ.2.50 కోట్ల బీమా

- జిల్లాలో 1,623 మందికి లబ్ధి
- గత ఖరీఫ్‌లో 1,760 హెక్టార్లలో తగ్గిన దిగుబడి
- ఈక్రాప్ ఆధారంగా పంటనష్టం గుర్తింపు
- 8న రైతుల ఖాతాల్లో జమ చేయనున్న ప్రభుత్వం


చింతూరు గ్రామ సచివాలయంలో పంట బీమా జాబితాలను పరిశీలిస్తున్న రైతులు

సాక్షి,పాడేరు: గతేడాది ఖరీఫ్‌లో పంట నష్టాలకు సంబంధించి బాధిత రైతులకు బీమా పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. గత ఏడాది ఖరీఫ్‌లో వరి, మొక్కజొన్న, రాగులు, పసుపు పంటలకు సంబంధించి దిగుబడి ఆధారంగా వైఎస్సార్ ఉచిత పంటల బీమాను చెల్లించేందుకు చర్యలు తీసుకుంది.

- జిల్లాలోని రంపచోడవరం, చింతూరు, వై.రామవరం, వి.ఆర్.పురం, చింతపల్లి ప్రాంతాల్లో దిగుబడి నష్టపోయిన 1623 మంది రైతులను ఈక్రాప్ ద్వారా గుర్తించారు.1760 హెక్టార్లలో పంట నష్టానికి సంబంధించి రూ.2,50,97,360 పరిహారాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది.

ఆర్‌బీకేల్లో జాబితాలు

జిల్లాలోని పంట నష్టపోయి పరిహారం మంజూరైన బాధిత రైతుల జాబితాను సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నారు. రైతుల సామాజిక తనిఖీలు నిమిత్తం ఈనెల 3వతేదీ వరకు జాబితాలు ప్రదర్శించాలని ప్రభుత్వం వ్యవసాయశాఖను ఆదేశించింది. పంట విస్తీర్ణం, ఇతర అంశాలపై రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు. ఎలాంటి సాంకేతిక సమస్యలు ఉన్నా రైతులు లిఖితపూర్వకంగా ఆర్‌బీకే కేంద్రాల అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది.దివంగత సీఎం వైఎస్ జయంతి, రైతు దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 8వ తేదీన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆయా బాధిత రైతుల ఖాతాల్లో సొమ్ము జమ అవుతుంది.

మండలాల వారీగా..

రంపచోడవరం మండలం ఆకూరులో70 మందికి 68.9 హెక్టార్లకు రూ.14,56,562, బొలగుండలో 57మందికి 46.22 హెక్టార్లకు రూ.2,72,490, మాడిచెర్లలో 166మందికి 136.73 హెక్టార్లకు రూ.8,06,012, వేములకొండలో 99మందికి 67.5 హెక్టార్లకు రూ.14,26,883 మంజూరైంది, చింతూరు మండలం ఏ.జి.కోడురులో 192 మందికి 171.32 హెక్టార్లకు రూ.4,27,957, చింతూరులో 66 మందికి 118.82 హెక్టార్లకు రూ.14,63,694, ముకునూరులో 78 మందికి 88.06 హెక్టార్లకు రూ.17లక్షల 735, పేగలో 503 మందికి 807.33 హెక్టార్లకు రూ.1,46,03,173 మంజూరైంది. వై.రామవరం మండలం చింతలపూడిలో 68మందికి 48.24 హెక్టార్లకు రూ.17,70,312, గూర్తెడులో 20మందికి 13.76 హెక్టార్లకు రూ.5,04,818 మంజూరైంది. వరరామచంద్రపురం మండలం చినమట్టపల్లిలో 104మందికి 95.93 హెక్టార్లకు రూ.2,68, 282,పెదమట్టపల్లిలో 49మందికి 51.8 హెక్టార్లకు రూ.2,37,192, రాజుపేటలో 34మందికి 24.49 హెక్టార్లకు రూ.1,38,600 మంజూరైంది. చింతపల్లి మండలం కుడుముసారిలో నలుగురికి 2.39 హెక్టార్లకు రూ.1,696, లంబసింగిలో 117మందికి 28.67 హెక్టార్లకు రూ.20,326 చొప్పున మంజూరైంది.

ఈ క్రాప్ ఆధారంగా పంట నష్టం గుర్తింపు



ఈక్రాప్ నమోదు ద్వారానే వైఎస్సార్ ఉచిత పంటల బీమాను పారదర్శకంగా అమలు జేస్తున్నాం. వీటికి సంబంధించిన జాబితాలను సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నాం. రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తున్నాం.ఈనెల ఎనిమిదవ తేదీన రైతుల ఖాతాల్లో బీమా పరిహారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జమ చేస్తారు.

– ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

7న పలకజీడిలో మెగా వైద్యశిబిరం

- యువతకు వాలీబాల్ పోటీలు
- కొయ్యూరు సీఐ స్వామినాయుడు



కొయ్యూరు: మండలంలోని పలకజీడి సంత ప్రాంగణంలో ఈనెల ఏడున మెగా వైద్య శిబిరంతో పాటు వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నామని సీఐ స్వామినాయుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ యూ చీడిపాలెం, ఎం.భీమవరం, బూదరాళ్ల ప్రాంతాలకు చెందిన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైద్య శిబిరానికి చిన్నపిల్లల వైద్య నిపుణులు, స్త్రీలకు సంబంధించిన వైద్య నిపుణులు, కళ్లు, గుండెకు సంబంధించిన వైద్యులు విశాఖలోని లోటస్, అను ఆస్పత్రుల నుంచి వస్తారన్నారు. యువతకు నిర్వహించే వాలీబాల్ పోటీలో ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతికి రూ.15 వేలు, తృతీయ బహుమతికి రూ.పది వేలు నగదు ఇస్తామన్నారు. టీ షర్టులు, క్రీడా సామగ్రిని కూడా ఇస్తామన్నారు. వాలీబాల్ పోటీల్లో పాల్గొనేవారు (సీఐ: 9440904217, ఎస్‌ఐలు 9440904217, 9440904241) నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

90 కేజీల గంజాయి స్వాధీనం

- వేర్వేరు కేసుల్లో 9 మంది అరెస్టు
- మరో ఇద్దరి పరారీ


మద్దులూరు వద్ద పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

మారేడుమిల్లి: వేర్వేరు కేసుల్లో 90 కేజీల గంజాయిని మారేడుమిల్లి పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్‌ఐ రాము వివరాల ప్రకారం... బడిశాకు చెందిన పూర్ణపాంగి, పాంగి కిషోర్, కర్ణాటకకు చెందిన అయ్యప్ప ఒడిశా రాష్ట్రం చిత్రకొండ నుంచి రాజమహేంద్రవరానికి కారులో గంజాయిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని మద్దులూరు గ్రామం వద్ద పోలీసులు వాహనాల తనిఖీల్లో పట్టుకున్నారు. వారి నుంచి 80 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, కారును సీజ్ చేసి, నిందితులను అరెస్ట్ చేశారు.

ఇదే కేసులో మరో ఇద్దరు నిందితులు లక్ష్మణ్, బెజవాడ రవి పరారీ అయ్యారు. అదేవిధంగా వై.రామవరం మండలం మంగంపాడు గ్రామానికి చెందిన మరిగెల అరుణ్ కుమార్‌రెడ్డి, తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన గట్టి అనిల్, మధురపూడి గ్రామానికి చెందిన అద్దాల వెంకట శివ సూర్యారావు, రంపచోడవరం మండలం పోక్స్‌పేట గ్రామానికి చెందిన పెంటపాటి బాలు తేజ్ అవినాష్, గుత్తికొండ రాజేష్, గోకవరం మండలం గుమ్మలదొడ్డి గ్రామానికి చెందిన బి. రూపేష్ కుమార్ కారులో మంగంపాడు నుంచి కోరుకొండకు గంజాయిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని కూడూరు గ్రామం వద్ద పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి పది కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కారు సీజ్ చేసి, నిందితులను అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ప్రమాదం

- బ్రేక్ ఫెయిల్‌తో చాకచక్యంగా కొండను ఢీకొట్టిన డ్రైవర్
- లేకుంటే లోయలోకి దూసుకుపోవాల్సిన పరిస్థితి
- ప్రయాణికులకు స్వల్ప గాయాలు


ఘాట్‌లో ఏనుగురాయి మలుపు వద్ద బ్రేక్ ఫెయిల్‌తో అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

సాక్షి, పాడేరు: పాడేరు ఘాట్‌లోని ప్రమాదకర ఏనుగురాయి మలుపు వద్ద ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. శనివారం సాయంత్రం పాడేరు నుంచి విశాఖపట్నం వెళ్తుండగా 5.30 గంటల సమయంలో బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపు తప్పింది. లోయలోకి దూసుకువెళ్లకుండా డ్రైవర్ కేపీరావు చాకచక్యంగా కొండను ఢీకొట్టించాడు. దీంతో ప్రయాణికుల్లో కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో పలు ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు ఉన్నారు. శనివారం సాయంత్రం వరకు విధులు నిర్వహించిన వారు ఆదివారం సెలవు కావడంతో మైదాన ప్రాంతాల్లోని నివాసాలకు ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. బస్సు అదుపుతప్పిన సమయంలో వారంతో పెద్ద ఎత్తున కేకలు వేశారు. కొండను ఢీకొట్టడం వల్ల పెను ప్రమాదం తప్పడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. వీరంతా వేర్వేరు బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో మైదాన ప్రాంతాలకు వెళ్లారు.

కిలో టమాటా రూ.150



సంతకు తెచ్చిన టమాటాలు

ముంచంగిపుట్టు: స్థానిక వారపు సంతలో శనివారం టమాటా ధర ఆకాశాన్నంటింది. మైదాన ప్రాంతం నుంచి గిరిజన ప్రాంతానికి దిగుమతి తగ్గడంతో దీనికి డిమాండ్ ఏర్పడింది. తాజాగా మైదాన ప్రాంతం నుంచి తెచ్చి ఇక్కడ కిలో రూ.150 విక్రయించారు. గత వారం రూ. 80 ఉండగా, ఈ వారం సంతలో పెరిగిన రెట్టింపు ధరను చూసి కొనుగోలుదారులు షాక్‌కు గురయ్యారు. టమాటా పోగు రూ. 20కు అమ్ముతున్నారు. పోగులో ఐదారు టమాటాలు మాత్రమే ఉండటంతో కొనడానికి సంకోచించాల్సిన పరిస్థితి నెలకొంది. గత వారం వారపు సంతలో బుట్ట టమాటా రూ.550 కాగా, ఇప్పుడు రూ.1,600 కావడంతో కొని అమ్మడానికి సైతం వీలు లేకుండా పోయిందని రైతులు వాపోయారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

అరకు ఎంపీ గొడ్డేటి మాధవి

కొయ్యూరు: ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించడానికి జగనన్న సురక్ష కార్యక్రమం తోడ్పడుతుందని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. ఎవరికి ఎలాంటి సమస్య ఉన్నా సచివాలయాల పరిధిలోని సమావేశాల్లో తెలపాలని సూచించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం సందర్భంగా శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. అరకు పార్లమెంట్ పరిధిలో వలంటీర్లు వారికి సంబంధించిన ప్రాంతాల్లో గృహాలను సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారని తెలిపారు. ఉచితంగా 11 రకాల సర్టిఫికెట్లను అందజేయడం మరువలేని విషయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఇంతకు ముందు ఏ ప్రభుత్వమూ నిర్వహించలేదన్నారు. సచివాలయాల వేదికగా చేసుకుని వచ్చే ఫిర్యాదులను తీసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకుండా ఉంటే వాటిని అందించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు.



మాట్లాడుతున్న మాధవి

6 కిలోల గంజాయి స్వాధీనం

చీడికాడ: అప్పలరాజుపురం కాటా వద్ద ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. అప్పలరాజుపురం కాటా వద్ద అనుమానాస్పదంగా ఆరుగురు సంచరిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు శనివారం ఉదయం వెళ్లి తనిఖీలు నిర్వహించినట్టు చెప్పారు. తమిళనాడుకు చెందిన ఎం.డి.నాగుర్‌ఖాన్,ఎం.డి.యూసఫ్,ఎం.డి.ఇస్మాయిల్,వసంతి సీతాశర్మతో పాటు ఒక మైనర్‌ను, పెదబయలకు చెందిన గోమంగి దేవినాయుడును అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

108, 104 సిబ్బంది సంబరాలు

రంపచోడవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 104, 108 సేవలను ప్రారంభించి మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రంపచోడవరం ఏరియా ఆస్పత్రి ఆవరణలో శనివారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం, చింతూరు డివిజనల్ మేనేజర్లు మునగా సతీష్ కుమార్, యర్రంశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ ద్వారా ఏజెన్సీ మారుమూల గ్రామాల్లో సైతం 108 ద్వారా అత్యవసర సేవలతోపాటు, 104 ద్వారా సాధారణ రోగాలకు మందులు అందజేస్తున్నామన్నారు. రంపచోడవరం, చింతూరు డివిజన్ 108, 104 సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివిజనల్ మేనేజర్లు

మృతదేహాలకు పూర్తికాని పోస్టుమార్టం

- పంచనామా నివేదిక వచ్చాక చేస్తామన్న వైద్యులు
- ప్రయివేటు ఆస్పత్రికి ముగ్గురు క్షతగాత్రుల తరలింపు

మహారాణిపేట: అచ్యుతాపురం సాహితీ ఫార్మా పరిశ్రమలో మరణించిన వారికి ఇంకా పోస్టుమార్టం పూర్తి కాలేదు. ఈ పరిశ్రమలోని అగ్ని ప్రమాదంలో కార్మికులు పైలా సత్తిబాబు, ఉప్పాడ తిరుపతి మృతి చెందిన సంగతి విదితమే. పోలీసుల నుంచి పంచనామా నివేదిక రాకపోవడంతో పోస్టుమార్టం నిర్వహించలేదని వైద్యులు శనివారం తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ కార్మికులు బియ్య రామేశ్వర్, సాగిరెడ్డి రాజబాబు, సమంగి అప్పారావులను ఇండస్ ఆస్పత్రికి తరలించినట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. కేజీహెచ్ సీఎస్ఆర్ బ్లాక్‌లో నూకనాయుడు మాత్రమే చికిత్స పొందుతున్నట్టు వివరించారు.

మృతుల కుటుంబాలకు రూ.కోటి ఇవ్వాలి

ఫార్మా కంపెనీ ఘటనలో చనిపోయిన వారి కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు బండారు సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. ఇక్కడ కేజీహెచ్ మార్చురీ వద్దకు వారు చేరుకుని మీడియాతో మాట్లాడారు. మృతుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఎవరిస్తారని, తదితర డిమాండ్లను అంగీకరించిన తర్వాత మాత్రమే పోస్టుమార్టం చేయాలన్నారు.

క్షతగాత్రులకు రూ. 15 లక్షలు ఇవ్వాలి: జనసేన

ఫార్మా కంపెనీ క్షతగాత్రులకు రూ. 15 లక్షలు ఇవ్వాలని జనసేన పార్టీ నాయకులు కోన తాతారావు, సుందరపు విజయకుమార్, శివప్రసాద్ రెడ్డి, పసుపులేటి ఉషా కిరణ్ డిమాండ్ చేశారు. అనంతరం సీఎస్ఆర్ బ్లాక్‌లో బాధితులను పరామర్శించారు.

సాహితీ ఫార్మా ఎదుట ఆందోళన

రాంబిల్లి: సాహితీ ఫార్మా వద్ద శనివారం మృతుల కుటుంబ సభ్యులు, సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేశారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, నాయకులు దేముడునాయుడు, సోమునాయుడు డిమాండ్ చేశారు. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు విమర్శించారు.

రూ.34 లక్షల పరిహారం

మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఇప్పటికే రూ.25 లక్షల చొప్పున పరిహారం ప్రకటించగా కంపెనీ యాజమాన్యం ఇన్సూరెన్స్, పీఎఫ్‌లతో కలిపి మరో రూ.9 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించినట్టు ఎస్ఐ దీనబంధు తెలిపారు. దీంతో మృతుల కుటుంబాలకు రూ. 34 లక్షల పరిహారం అందనుంది.



సాహితి ఫార్మా వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు



సాహిత ఫార్మా వద్ద ధర్నా చేస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

సీజనల్ వ్యాధులకు మెరుగైన వైద్య సేవలు

రంపచోడవరం: స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు సూపరింటెండెంట్ కె. లక్ష్మి తెలిపారు. ఏజెన్సీలో సీజనల్ జ్వరాలు దృష్టిలో పెట్టుకుని ఇక్కడకు వచ్చే జ్వరపీడితులకు ప్రత్యేకంగా వార్డు ఏర్పాటు చేశామన్నారు. ఏరియా ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలకు వైద్యులు అందుబాటులో ఉన్నారన్నారు. కొత్తగా ఈఎన్‌టీ వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఇక్కడ వైద్య సేవల్లో ఎటువంటి ఇబ్బందులున్నా తనకు ఫిర్యాదు చేయాలని సూచించారు.



రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో సిద్ధం చేసిన బెడ్‌లు

సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులకు భరోసా

జి.మాడుగుల: సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ప్రతి నెలా అందజేస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రధాని మోదీ మధ్యప్రదేశ్‌లో వర్చువల్ విధానంలో ప్రారంభించిన జాతీయ సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలన ఉద్యమం కార్యక్రమాన్ని వైద్యులతో కలిసి ఆమె వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణైతే వారికి ప్రభుత్వం పౌష్టికాహారం నిమిత్తం ప్రతి నెలా రూ.10 వేలు పింఛనుఅందజేస్తుందన్నారు. సమీప ఆరోగ్య కేంద్రాల్లో తగిన వైద్యం పొందాలన్నారు. వైద్యాధికార్లు శశికాంత్, చంద్రశేఖర్, ఎంపీహెచ్ఈవో ఎన్. ప్రకాష్, సొలభం సర్పంచ్ ఐసరం హనుమంతరావు పాల్గొన్నారు.

రెండు గడ్డివాముల దగ్ధం

కె.కోటపాడు : ఎ.భీమవరంలో ఇద్దరు రైతులకు చెందిన గడ్డివాములు శనివారం దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన తర్రా సోమునాయుడు, పినిశెట్టి అచ్చిబాబులకు చెందిన గడ్డివాములు ప్రమాదవశాత్తూ అగ్నికి ఆహుతయ్యాయి. చోడవరం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ బాధిత రైతులను పరామర్శించి, ఒక్కొక్కరికీ రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తర్రా సన్యాసమ్మ, తర్రా శేషు, మోహన్‌రావు, చంద్రరావు ఉన్నారు.



బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న అనురాధ